సాగుకు యంత్ర సాయం

- వ్యవసాయంలో పెరుగుతున్న సాంకేతిక వినియోగం
- యంత్రాలతో ఖర్చు తక్కువ, సమయం ఆదా



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు సబ్సిడీపై అందించిన ట్రాక్టర్లు

రంగంపేట: గతంలో పొలం దున్నాలన్నా, విత్తనం వేయాలన్నా, పండించిన పంటను ఇంటికి తీసుకు రావాలన్నా కాడెద్దులు, ఎడ్ల బండిని ఉపయోగించే వారు. కాని మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల రాకతో ఇప్పుడు కాడెద్దుల వినియోగం దాదాపుగా కనుమరుగైంది.

యంత్రాలవైపే రైతుల మొగ్గు

అనపర్తి నియోజకవర్గంలో 46,500 ఎకరాల్లో వరి, 16,400 ఎకరాల్లో ఉద్యానపంటలు సాగవుతున్నాయి. రాజానగరం నియోజకవర్గంలో 47,650 ఎకరాల్లో వరి, 37,300 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా రైతులు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో రైతుల ఇంటి ముందు ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా ఒకటి, రెండు ఎడ్ల బండ్లు ఉన్నా వారిని బాడుగకు పిలిచేవారు లేరు. తక్కువ సమయంలో ఎక్కువ వ్యవసాయ పనులు చేసేలా ఆధునిక యంత్రాలు రావడంతో అందరూ వాటిపైనే మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీపై యంత్రాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేశారు. రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందించడంతో 2019–2024 మధ్య కాలంలో సాగుకు యంత్రాల వినియోగం గణనీయంగా పెరిగింది. సన్న, చిన్నకారు రైతులకు సైతం ఆధునిక యంత్రాలను సబ్సిడీపై అందజేశారు. ట్రాక్టర్‌తో పాటు విత్తనాలు నాటే యంత్రాలు, కోత మెషీన్లు, రోటోవేటర్లు తదితర యంత్రాలను అన్నదాతలకు చేరువ చేశారు. ప్రస్తుతం కూలీలను కలుపు తీయడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. యంత్రాలతో పనులు చేయించడం వల్ల ఖర్చు తక్కువతో పాటు సమయం ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు.

రెండు జతల కాడెద్దులు ఉండేవి



నాకు 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 15 ఏళ్ల క్రితం రెండు జతల కాడెద్దులు ఉండేవి. ఈ ఎద్దులు, కూలీలతో వ్యవసాయం చేసే వాళ్లం. ప్రస్తుతం కూలీలు దొరకడం కష్టంగా ఉండటంతో పాటు పశుపోషణ సమస్యగా మారింది. అందుకే ట్రాక్టర్ సాయంతో వ్యవసాయ పనులు చేయడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది.

– నలమాటి భీముడు, రైతు, వడిశలేరు, రంగంపేట మండలం

ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు



మాకు పదెకరాల పొలం ఉంది. ట్రాక్టర్లతోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. గతంలో కాడెద్దులతో పని చేయించాలంటే రోజంతా కష్టపడేవాళ్లం. ట్రాక్టర్ ద్వారా అయితే గంటలోనే పని అయిపోతుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ పని అవుతున్న కారణంగానే వ్యవసాయంలో యాంత్రీకరణ వైపే మొగ్గు చూపుతున్నాం.

– కంటిపూడి సత్యనారాయణ, రైతు, చంద్రేడు, రంగంపేట మండలం

ఉపాధ్యాయ సమస్యలపై అవిశ్రాంత పోరాటం



కొంకుదురులో సభ్యత్వ నమోదుపై ప్రచారం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

బిక్కవోలు: సీపీఎస్ రద్దు, జీఓ–117 రద్దు, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ పదోన్నతులు తదితర ఉపాధ్యాయ సమస్యలపై అవిశ్రాంత పోరాటం చేస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకుడు వెలగల భామిరెడ్డి అన్నారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం కొంకుదురు ఉన్నత పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా హక్కులను సాధించుకోవడంతో పాటు విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పందలపాక, కాపవరం, ఇలపల్లి తదితర పాఠశాలల్లో క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు తమలంపూడి ఈశ్వరరెడ్డి, కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఎస్టీయూ సంఘం అధ్యక్షుడు ఎన్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి డి.సురేంద్రకుమార్, కె.పోలిరామారెడ్డి, బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ గుర్రాల జోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

రంగంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.హేమ ఆధ్వర్యంలో సోమవారం ఆయన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెదపూడి: రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన వీరవెంకట సత్యనారాయణ, నాగదేవి దంపతులు తమ కుమారుడు తోరాటి రీయాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అనపర్తి తేతలి రామిరెడ్డి, మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు సోమవారం అందజేశారు. అలాగే భవిత సెంటర్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు పాలు, పెరుగు, బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి ఆదిరెడ్డి, నల్లమిల్లి వినురెడ్డి, చేవలి శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పెదపూడి: గ్రామాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ మట్టిని అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.త్రివేణి హెచ్చరించారు. శహపురం గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్కడి నుంచి మట్టి తరలిస్తున్న వారి వివరాలను స్థానిక వీఆర్వోలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తున్న లారీల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుందని స్థానికులు అధికారులకు విన్నవించారు.

గాడాల పీఠంలో 8 నుంచి మహోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠంలో ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకూ వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. దీనిలో భాగంగా 8 నుంచి 22వ తేదీ వరకూ వరలక్ష్మి హోమం, 29న అష్టలక్ష్మి ధన్వంతరి హోమం నిర్వహిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు అన్నారు. సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ వద్ద ఏటిగట్టుపై తాడి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గానుగ, వేప, మారేడు, సీతాఫలం, బాదం మొక్కలు నాటారు.

నిబంధనలు పాటించాలి

రాజమహేంద్రవరం సిటీ: ఆర్ట్స్ కళాశాల సమీపంలోని అర్బన్ ఫుడ్ ప్లాజాలో షాపులను ప్రభుత్వ నిబంధనల మేరకు రాత్రి 11 గంటలకే మూసివేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన సోమవారం షాపులను సందర్శించారు. ఈ సందర్భంగా నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నాని టీమ్ ప్రత్యేక పూజలు



దేవితల్లిని దర్శించుకున్న చిత్ర బృందం

రాజానగరం: వర్ధమాన హీరో, దర్శకుడు, నిర్మాత పవన్‌కుమార్.కె స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యావరేజ్ స్టూడెంట్ నాని' చిత్ర బృందం రాజానగరంలోని జగన్మాత దేవితల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసింది. స్థానికంగా ఉన్న మిత్రుల ఆహ్వానం మేరకు హీరో, హీరోయిన్లు పవన్ కుమార్, సహిబా బాసిన్, స్నేహమాల్వియ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నల్లమిల్లిలో సాయిబాబాను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పలువురిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరామర్శించారు. రంగంపేట మండలంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన ప్రగడరెడ్డి సాయిబాబా ఇటీవల కాలుకి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబాను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పామర్తి అన్నవరం మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎస్టీ రాజాపురంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నల్లమోలు సత్యనారాయణ, పంపన సాయి మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనపర్తిలో తేతల అప్పిరెడ్డి, రామవరం గ్రామంలో కొవ్వూరి నారాయణరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి మాతృమూర్తి గౌరయమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలో గొడ్డు వీరబాబు కుమార్తె లక్ష్మీప్రసన్న మరణించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

250 మందికి వైద్య పరీక్షలు



కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

సీతానగరం: శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం సాధారణ, కంటివైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ 250 మందికి వైద్యసేవలు అందించారు. అలాగే 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారికి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యులు ఎస్.సుధాకర్, కె.సత్తిబాబు, గోపిశెట్టి అచ్చారావు, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే ముంపు పొలాలకు రక్షణ



శ్రీరంగపట్నంలో ముంపుబారిన పడిన పొలాలను పరిశీలిస్తున్న నరసింహారావు

మధురపూడి: ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిపోయిన పొలాలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఆయన సోమవారం వ్యవసాయశాఖ మండలాధికారి ఏ.గౌరీదేవితో కలిసి కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. పాక్షికంగా మునిగిన వరి పొలాల్లోని నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలన్నారు. తెగుళ్ల వ్యాప్తి చెందకుండా లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట పూర్తిగా దెబ్బతింటే ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలను నేరుగా వెదజల్లిగానీ, నారు పెంచయినా నాట్లు వేసుకోవాలన్నారు. మెరకల్లో సామూహికంగా కమ్యూనిటీ నారుమళ్లు వేసుకోవాలన్నారు.

నివాసాల సమీపంలో చెత్త డంపింగ్



రాపాకలో నివాసాల మధ్య డంపింగ్ చేసిన చెత్త

సీతానగరం: నివాస గృహాలను ఆనుకుని చెత్త డంపింగ్ చేయడంతో రాపాక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానిని అక్కడి నుంచి వెంటనే తరలించాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. రాపాక గ్రామంలోని గోగులమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం దగ్గరలో నివాస గృహాలను ఆనుకుని పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లపై చెత్తను తీసుకువచ్చి డంపింగ్ చేశారు. గత నెల 28న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పంటపొలాలను పరిశీలించడానికి వస్తుండటంతో కలెక్టర్ ప్రశాంతి రాపాక సచివాలయానికి వచ్చారు. ఆ సమయంలో సచివాలయం ముందు నుంచి పంచాయతీ ట్రాక్టర్లు వెళ్లాల్సి ఉండగా, కలెక్టర్ దృష్టిలో పడకుండా గోగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఎనిమిది ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ చేశారు. దీనితో స్థానికులు రావూరి రామరాజు, కొత్తపల్లి లక్ష్మణరావు, పులి శ్రీనివాస్, సూదా భాస్కరరావు, మల్లిపూల వెంకటేశ్వరరావు, గోలిమిల్లి సింహాచలం, మోటుకూరి ధనలక్ష్మి, తోట రమాదేవి తదితరులు చెత్తను తీసుకువస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ స్థానికులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. అయితే వేసిన చెత్తను ఇంత వరకు తీయలేదు. దాని నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఇక్కడ నుంచి తరలించాలని కోరుతూ సచివాలయంలో కూడా వినతిపత్రం అందించారు. చెత్తను తరలించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లతామని హెచ్చరించారు.



రాపాక పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న స్థానికులు (ఫైల్)

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం



పుట్టకొండలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి

పెదపూడి: తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని, తల్లులు తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ అనసూరి జ్యోతి తెలిపారు. మండలంలోని పుట్టకొండ గ్రామంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న దాడులు, వేధింపుల నుంచి ఎలా తమనితాము రక్షించుకోవాలో వివరించారు.

ఆహారపు అలవాట్లతో దంత సమస్యలు



విద్యార్థికి దంత పరీక్ష చేస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: మారుతున్న ఆహారపు అలవాట్లతో చిన్ననాటి నుంచే దంత సమస్యలు వస్తున్నాయని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్ అన్నారు. సత్యసాయి గురుకులం, జీఎస్ఎల్ దంత వైద్యకళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో విద్యార్థులకు దంత వైద్యశిబిరం నిర్వహించారు. శ్యాంసుందర్ మాట్లాడుతూ ఆహార ఆకర్షణకు వినియోగించే వివిధ రకాల రసాయనాల ప్రభావంతో పిల్లలు అనేక దంత సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో సుమారు 1200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు, చికిత్స అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఘంటా సునీల్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పవిత్ర, ఏవో చిట్టిబాబు, పీఆర్‌ఓ కుమార్, పీజీ మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు, ఉపకార వేతనాల పంపిణీ

సీటీఆర్ఐ: ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అన్నారు. ఆయన అధ్యక్షతన సోమవారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పొలసానపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమన్నారు. తన వాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ చదువుతున్న ఎల్.చేతన, వారణాసి ఐఐటీ కాలేజీలో ఐఐటీ చదువుతున్న ఎస్.జాషువా అనే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.12 వేల చొప్పున రూ.24 వేలు, క్లబ్ తరఫున ఒక విద్యార్థినికి రూ.6 వేలు అందించారు. వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలను వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, నట్టి సూరి అప్పారావు, కుంచె వేణుమాధవ్, అనసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న కేవీకే ప్రధానాధికారి నాయుడు

రాజానగరం: ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) సహకారంతో గోకవరం మండలం వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలచవర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి, అధిక దిగుబడులను అందుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పంటలను పండించాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు ప్రకృతి వ్యవసాయ విధానాలలో ఉపయోగించే సేంద్రియ రసాయనాలైన బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, దశపత్ర కషాయం, నీమాస్త్రం మున్నగు కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ఏపీడీ షేక్ వలీ, భువిజ గ్లోబల్ అగ్రిటెక్ అండ్ హార్టికల్చర్ ఎఫ్‌పీసీ ప్రతినిధి నరసింహారావు, గోకవరం, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన పలువురు రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



సంపర విజయదుర్గ అమ్మవారు



త్రిముఖ లింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెదపూడి: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం నుంచి శ్రావణ మాసం పూజలు ప్రారంభమయ్యాయి. సంపర గ్రామంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు హనుమంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

త్రిముఖ లింగేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా స్వామివారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రక్తదానం శిబిరం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రెడ్ క్రాస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్‌బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం జోన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఆర్‌కె రామచంద్ర మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకరరావు మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.